మెదక్ I సంగారెడ్డి I సిద్దిపేట
వార్త

## ఏడుపాయల్లో మంజీర నీరు...



ఏడుపాయల ఆలయం ఎదుట ప్రవహిస్తున్న మంజీర

**పాపన్నపేట,అక్టోబరు 31, ప్రభాతవార్త :** సింగూరు నుండి నీరు విడుదల చేయడంతో ఏడుపాయల్లోని మంజీర నదిలో వరదలు పోటెత్తాయి. మనవరం పొంగి పొర్లుతుండటంతో, ఆలయం ముందు నుండి జోరుగా నీరు ప్రవహిస్తుంది. సింగూరు నుండి 35,864 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. ఆలయం మూసి వేయడంతో, దుర్గమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి భక్తులు పూజలు చేస్తున్నారు.

## ఆత్మహత్య చేసుకుంటానని వీడియో కాల్ చేసిన యువకుడి గుర్తింపు
### తండ్రికి అప్పగించిన పోలీసులు

**కొమురవెల్లి, అక్టోబరు 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాంసాగర్ గ్రామానికి చెందిన గంగుల లచ్చయ్య కుమారుడు గంగుల కోటి తండ్రికి తెలియకుండా రెండు గొర్రెను తక్కువ ధరకు అమ్ముడంతో తండ్రి మందలించగా ఆత్మహత్య చేసుకుంటానని వీడియోకాల్‌చేసి చెప్పాడు. దీంతో లచ్చయ్య డయల్ 100 కాల్ చేసి చెప్పగా బ్లూ కోల్ట్స్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు తిరుపతి, బాలరాజు వెంటనే స్పందించి లోకేషన్ ద్వారా తిమ్మారెడ్డిపల్లి ఏరియాలో కోటిని గుర్తించి తండ్రికి అప్పగించారు.



కోటిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు



ఏరియల్ సర్వే నిర్వహిస్తున్న సీఎం, మంత్రి పొన్నం

## నష్టపోయిన పంటలు, రోడ్లు, కల్వర్టులను
## ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన సిఎం రేవంత్‌రెడ్డి

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 31, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతంలో మొంథా తుఫానుతో నష్టపోయిన పంటలు, కల్వర్టులు,రోడ్లను సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి శుక్రవారం హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల మీదుగా సిఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించి నష్టపోయిన పంటలను, హుస్నాబాద్ మార్కెట్ యార్డులో పాటు భారీ వరద నీటి మూలంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను, ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అలాగే వరద నీటిలో కొట్టుకుపోయి గల్లంతు అయి మృతి చెందిన మోత్కులపల్లి వరద ప్రాంతాన్ని ఆయన ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు.

## ఐక్యతను కాపాడటానికి రన్ ఫర్ యూనిటీ
### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




జాతీయ ఐక్యత ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, విద్యార్థులు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 31, ప్రభాతవార్త :** సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ సమగ్రతను కాపాడుతూ, భిన్నత్వంలో ఐక్యతకు ప్రతీకగా నిలవడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ధ్యాన్‌చంద్ చౌరస్తా నుండి స్థానిక కలెక్టర్ కార్యాలయం వరకు రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను కాపాడటానికి రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం మంచి సందేశాన్ని ప్రజలకు చేరవేస్తుందని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ దేశ ఐక్యత కోసం అఖండ కృషి చేసి ఉక్కు మనిషిగా పేరుగాంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా ఏక్తా దివస్
### పాల్గొన్న అదనపు కలెక్టర్, ఎస్పి




ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, అదనపు కలెక్టర్, ప్రజలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 31, ప్రభాతవార్త:** శుక్రవారం రాష్ట్రీయ ఏకతా దివాస్ (రాష్ట్ర ఐక్యతా దినోత్సవం), సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ-2కే రన్" ను సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. కలెక్టరేట్ నుండి ఐబీ వరకు 'రన్ ఫర్ యూనిటీ" 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31ని రాష్ట్రీయ ఏక్తా దివాస్‌గా పిలుస్తాం అన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు అవిశ్రాంత కృషిచేసి ఉక్కుమనిషిగా పేరుగాంచిన దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని దేశ సమగ్రతను కాపాడుతూ, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ 2కె రన్‌లో సంగారెడ్డి పట్టణంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు, పోలీస్ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగూరు ప్రాజెక్టు 4గేట్లు ఎత్తి నీరు విడుదల
### -ఇన్‌ఫ్లో 33765-ఔట్ ఫ్లో 35864 క్యూసెక్కులు

**పుల్‌కల్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహనం అధికం కావడంతో ప్రాజెక్టులోని 4 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటి పారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. ఇంత వరకు 3 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండగా ప్రాజెక్టులోకి వరద ప్రవాహం అధికమవడంతో ప్రాజెక్టులోని మరో గేటు (10వ గేటు) 2 మీటర్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 33765 క్యూసెక్కులుగా నమోదయింది. మొత్తం నాలుగు క్రస్ట్ గేట్ల ద్వార 33567 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 2275 క్యూసెక్కుల వరదను దిగువన గల మంజీర జలాశయానికి విడుదల చేశారు. మొత్తం ఔట్ ఫ్లో 35864 క్యూసెక్కులుగా నమోదయింది.



సింగూరు ప్రాజెక్టు దృశ్యం

# పత్తికి కనీస మద్దతు ధరను కల్పించాలి

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహా

**మునిపల్లి, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించి వారి ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహా సీసీఐ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మేళాసంగంలోని కాటన్ మిల్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అద్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని, పెద్దచెల్మెడ పిఏసిఎస్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రైతులకు కనీస మద్దతు ధరను కల్పించాలని సీసీఐ అధికారులను మంత్రి కోరారు. దళారులను నమ్మవద్దని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రం ద్వారా సదాశివపేట, రాయికోడ్,నారాయణఖేడ్, జోగిపేట, వట్‌పల్లి మండలాల పత్తి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పత్తి రైతులు కనీస మద్దతు ధరకోసం ఖికపాస్ కిసాన్ ఖిమొబైల్ యాప్‌ను డౌన్‌లోన్ చేసుకోవాలని సీసీఐ అధికారులు కోరారు.గత వర్షకాలంలో 3 లక్షల 80 వేల క్వింటల్ల పత్తిని కోనుగోలు చేసి రైతులకు 280 కోట్ల రూపాయలను చెల్లించామని సీసీఐ అధికారులు మంత్రి దామోదర్ రాజనర్సింహాకు వివరించారు. పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులకు జొన్న విత్తనాలను ఉచితంగా పంపిణి చేశారు.పెద్ద చెల్మెడ పిఏసిఎస్‌లో నాఫెడ్ వారి మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అందుతున్న ఆహారాన్ని, చదువు పట్ల అంగన్‌వాడీ టీచర్‌ని అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, పిఏసిఎస్ చైర్మన్ పద్మదుర్గయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, నాయకులు రాంరెడ్డి, సతీష్ కుమార్, అసద్‌పటేల్, వీరన్న పాటిల్, మనోహర్, వెంకట్రాములు, మక్సూద్ పటేల్, రహీం, సీసీఐ కమర్షియల్ ఆఫీసర్ వరుణ్, పిఏసిఎస్ సెక్రటరి శివారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వర్షానికి పాడైన పంటను పూరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
### సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

**కొండాపూర్, అక్టోబరు 31(ప్రభాతవార్త):** మండలంలోని తెర్పొల్ గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు శుక్రవారం రైతులతో కలిసి నష్టపోయిన పంట పొలాల పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను వల్ల జిల్లాలో 25 వేల ఎకరాలలో పంట నష్టం జరిగిందని అన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి అన్నారు. రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా ప్రస్తుతం వచ్చే పరిస్థితి లేదని అన్నారు. జిల్లాలో ప్రధానంగా పత్తి,వరి, మొక్కజొన్న, ఇతర కూరగాయ పంటలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వర్షం వలన పత్తి ఎకరాకు మూడు, నాలుగు క్వింటాలు కూడా సరిగా వచ్చే పరిస్థితి లేదని అన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రం వారు పెట్టిన నిబంధనలు రైతులకు ఇబ్బందులుగా ఉన్నాయని .తక్షణమే వాటిని తొలగించాలని వరి కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతులను ఆదుకోవాలని, ప్రైవేటు రైస్ మిల్లర్స్ తక్కువ రేటు చెల్లిస్తూ రైతులు మోసం చేస్తున్నా వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.వెంటనే జిల్లా కలెక్టర్ గారు క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులను పంపి పరిశీలన చేసి రైతాంగాన్ని ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె. రాజయ్య, రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షులు బి.నరసింహారెడ్డి, నాయకులు వెంకటేష్, మధు,రాజు, రైతులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**జహీరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులకు కనీసం ప్రతినెల వేతనాలు అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సిఐటియు జిల్లా సమాయ కార్యదర్శి ఎస్ మహిపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టనంలోని ఎంఈఓ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ వంటలు వండేందుకు కార్మికులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందించాలని, ప్రతి నెల బిల్లులు చెల్లించాలన్నారు. కార్మికులకు సకాలంలో బిల్లులు అందక అవస్థలు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇక నుంచి కార్మికులకు సకాలంలో బిల్లులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సావిత్రమ్మ, లక్ష్మమ్మ, కిష్టమ్మ, సుగుణమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.




వినతి పత్రాన్ని అందిస్తున్న భోజన కార్మికులు

## పెండింగ్ వేతనాలు చెల్లించేవరకు వంటలు బంద్

**చేర్యాల, అక్టోబరు 31,ప్రభాతవార్త :** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు వచ్చేవరకు నేటినుండి వంటలు బంద్ నిర్వహించి సమ్మె ప్రారంభిస్తున్నామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయం ముందు భోజన కార్మికులతోకలిసి ధర్నా నిర్వహించి సిబ్బందికి సమ్మె వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బండకింది అరుణ్, దండేబోయిన భాస్కర్,తుప్పతి రాజు, మధ్యాహ్న భోజన కార్మికులు ఒరుగలు వేంకటవ్వ,తాడురి సౌభాగ్యలక్ష్మి,చిర్ల రజిత,ముచ్చెల్లి కృష్ణవేణి,పోలోజు పద్మ,గుడ్ల పద్మ,తరిగొప్పుల స్వప్న,చింతకింది కనకవ్వ, మంజ నర్సమ్మ, ఉత్కం పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## రన్ ఫర్ యూనిటీ 2కె రన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**పటాన్ చెరు, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** భారతదేశ మొదటి ఉప ప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ లో భాగంగా పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటుచేసిన 2 కి.మీ రన్ ను శుక్రవారం ఉదయం పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ ఐక్యతకు ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు. స్వాతంత్ర్యానంతరం అనేక దేశీయ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి పటేల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు సీఐ వినాయక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గూడెం మధుసూదన్‌రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, వివిధ సంఘాల అధ్యక్షులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పట్టణ పుర ప్రముఖులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



2కే రన్ లో పాల్గొన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

# సేంద్రీయ సాగుతోనే భవిష్యత్తుకు భద్రత

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ఝరాసంగం, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సేంద్రియ పద్ధతిలో పంటలను సాగుచేసుకుంటే భవిష్యత్తుకు భద్రత ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మండల పరిధిలోని బిడెకన్నెలో అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్-లీడ్ నేచురల్ ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో కృషి సఖి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలంగా, ఆరోగ్యానికి మేలు చేసే పంటల కోసం సేంద్రీయ సాగు అత్యంత అవసరం అన్నారు. పురాతన పంటలను సాగు చేసుకునేందుకు కృషి సఖి మహిళలు ముందుండాలని సూచించారు. ఈ నెల 27వ తీరీఖు నుంచి 31వరకు శిక్షణ అందుకున్న నారాయణఖేడ్, రాయికోడ్, జహీరాబాద్ డివిజన్‌లకు చెందిన 15 మండలాల కృషి సఖి మహిళలకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీదేవి, బిక్షపతి, వ్యవసాయ అధికారి ప్రేమలత, వెంకటేశ్, ఆర్‌డిఓ దేవుజ, తహసీల్దార్ తిరుమల రావు, ఎంపిడిఓ మంజుల, అరణ్య సీఈఓ పద్మ, ఎన్‌ఎన్‌ఎఫ్ఐ నోడల్ అధికారి స్నేహ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

### విద్యార్థులకు కంప్యూటర్ బోధన తప్పనిసరి

**మునిపల్లి, అక్టోబరు 31(ప్రభాతవార్త):** ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ బోధన తప్పనిసరి అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు.శుక్రవారం. మునిపల్లి మండలం బుధేరా అంగన్‌వాడీ కేంద్రాన్ని, బుధేరా, కంకల్ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు విధానాన్ని పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల హాజరుశాతం పెంచి, శత శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.మనబడి కార్యక్రమంలో నిర్మించిన మధ్యాహ్న భోజన పథకం,షెడ్డును కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల వాతావరణం బాగుందని ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజు మధ్యాహ్న భోజన అందించాలని ఆదేశించారు.పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఈడిఎస్‌సి కార్పొరేషన్,మండల ప్రత్యేక అధికారి రామాచారి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రన్ ఫర్ యూనిటిలో పాల్గొన్న పోలీసులు

## ఉక్కుమనిషి ఉక్కు సంకల్పమే నేటి ఐక్య భారతం
### డిఎస్‌పి వెంకట్‌రెడ్డి

**నారాయణఖేడ్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** ఉక్కుమనిషి ఉక్కు సంకల్పమే నేటి ఐక్య భారతం అని నారాయణఖేడ్ డిఎస్పి వెంకట్ రెడ్డి అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని తాసిల్దార్ మైదానంనుండి వివిధ పాఠశాలలు,కళాశాలలు విద్యార్థులతో ఉపాధ్యాయులతో కలిపి నారాయణఖేడ్ పట్టణంలోగల రాజీవ్‌చౌక్ వరకు యూనిటీ ఫర్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ ఐక్యతకు ప్రతీక, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రీ ఐక్యతకు బలమైన పునాది వేసిన మహానాయకుడు సర్దార్ పటేల్ జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణ ఆయన దూరదృష్టి, ధైర్యం, దేశభక్తి ఈ తరం నేర్చుకోవాల్సిన విలువలు." అని పేర్కొన్నారు. ఐక్యతలోనే శక్తి, పటేల్ ఆత్మస్ఫూర్తి మనలో ఎప్పటికీ నిండుగా ఉండాలన్నారు. నేటి తరం విద్యార్థులకు పాఠశాలలో, కళాశాలలో సర్దార్ పటేల్ గురించి వివరించి చెప్పడం సర్దార్ పటేల్ గురించి పిల్లకు చెప్పి వారిలో చైతన్య కలిగించడం, పటేల్ వ్యక్తిత్వం ద్వారా పిల్లలు మంచి విషయాలు నేర్చుకునేలా పిల్లలకు గైడ్ చేయడం ద్వారా పిల్లల మంచి క్రమశిక్షణ గొప్ప విలువలు అలబడతాయి అన్నారు. భారతదేశం ఏకం కావడానికి ఉక్కు సంకల్పం కారణంగానే ఆయనకు ఉక్కుమనిషి అనే బిరుదు వచ్చిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రావుల శ్రీశైలం, ప్రధానోపాధ్యాయులు మన్మధ కిషోర్, నిత్యా సేవకులు, చంద్రశేఖర్ ఆచాజీ, ఫిజికల్ డైరెక్టర్ సంగ్రామ్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, పాల్గొన్నారు.

### మోత్కుపల్లి వాగులో కొట్టుకుపోయిన
## దంపతుల మృతదేహాలు లభ్యం

**అక్కన్నపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ ప్రభావంతో ఉద్రిక్తంగా ప్రవహిస్తున్న అక్కన్నపేట మండలం మోత్కులపల్లి వాగులో కొట్టుకుపోయిన ప్రణయ్(28), కల్పన(24) మృతదేహాలు లభ్యమయ్యాయి. భీమదేవరపల్లి మండలానికి చెందిన దంపతులు ఈసంపల్లి ప్రణయ్, కల్పన మోత్కులపల్లి వాగులో కొట్టుకపోగా ప్రవాహంలో మల్లంపల్లి గ్రామానికి చెందిన గొర్ల సమ్మయ్య పశువుల షెడ్డు వద్ద బైక్ లభ్యమయింది. దీంతో రెస్క్యూటీంతో గురువారం పకడ్బంధీగా గాలింపు చర్యలు చేపట్టినా మృతదేహాల ఆచూకీ దొరకలేదు.శుక్రవారం తెల్లవారుజామున ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగించడంతో దంపతుల మృతదేహాలు మోత్కులపల్లి వాగులోనే లభ్యమయ్యాయి. మృతదేహాలను చూసిన కుటుంబీకులు కన్నీటి పర్వంతమయ్యారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**మర్కుక్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** విద్యుత్‌షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ దామోదర్ కథనం ప్రకారం... ఎర్రవల్లి గ్రామానికి చెందిన రైతు సత్తయ్య(55) గురువారం మధ్యాహ్నం పొలానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం పొద్దుపోయేవరకు సత్తయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా బోరుబావి వద్ద విద్యుత్‌షాక్ తగిలి సత్తయ్య మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న మర్కుక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సత్తయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

## నీళ్ల బకెట్‌లో పడి చిన్నారి మృతి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్లోపడి చిన్నారి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన స్వప్న, ధనుంజయ్‌ల 18నెలల కూతురు రుచిత ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్లో పడింది. గమనించిన తల్లి స్వప్న మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో రుచిత మృతి చెందింది. పాప మృతి చెందడంతో ఆ తల్లి రోధన అక్కడ ఉన్న వారిని కలిచి వేసింది.

## వాగులో కొట్టుకుపోయిన వ్యక్తి మృతి

**అక్కన్నపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :** మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి రామకృష్ణ(25) గురువారం బైక్‌పై మల్లంపల్లి, గొల్లపల్లి గ్రామాల మధ్య ప్రయాణిస్తున్నక్రమంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో దారునూతి వాగులో కొట్టుకుపోయాడు.శుక్రవారం అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అదించడంతో అక్కడి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి కన్నీరు మున్నీరయ్యారు. రామకృష్ణకు ఆరు నెలల క్రితం హుస్నాబాద్ పట్టణానికి చెందిన అమ్మాయితో వివాహం జరుగగా పుట్టింటికి వెళ్ళిన తన భార్యను గురువారం తీసుకొస్తానని వెళ్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది.విషయం తెలుసుకున్న అక్కన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు మార్చురుకి తరలించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు సమాచారం.

## రూ.10 లక్షల విలువ చేసే హాషీమ్ ఆయిల్ పట్టివేత

**కంది, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మండల పరిధిలో (కంది-శంకర్‌పల్లి రోడ్డులో) శుక్రవారం అక్షయ పాత్ర ఫౌండేషన్ వద్ద శుక్రవారం అక్రమంగా నిల్వ ఉంచిన 10 లక్షల రూపాయల విలువ చేసే 964 గ్రాముల హాషీష్ ఆయిల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ బృందం, సంగారెడ్డి ఎస్‌హెచ్ఓ పర్యవేక్షణలో పట్టుకున్నారు. అక్రమంగా అయిల్‌ను నిల్వ ఉంచిన హైదరాబాద్‌లోని ఖాజేదన్‌కు చెందిన అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు.హాషీష్ అయిల్‌ను పట్టుకునే దాడిలో పోలీసు అధికారులు కెశ్రీనివాస్‌రావు, గాంధీ నాయక్, వీణారెడ్డి, చంద్రశేఖర్, అనిల్ కుమార్, యాదయ్య, దిలీప్ కుమార్‌రెడ్డి, అలీం, అమ్మతుల్‌కరీం, రామారావు నాయక్, సతీస్ మోహన్, ఉమారాణి, వివేక్, సయ్యద్ పాల్గొన్నారు.



నిందితుడితో పోలీసులు



ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఇందిరాగాంధీకి ఘన నివాళులు

**జహీరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ఇందిరా గాంధీ 41వ వర్ధంతి వేడుకలను శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు జరుపుకున్నారు. పట్టణంలోని జాతీయ రహదారిపై గల ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు కండెం నర్సింలు, మొహమ్మద్ ఖాజా మియా, రాములు నేత, మోతిరాం రాథోడ్, రాజశేఖర్, సుజాత, మహమ్మద్, కాశీనాథ్, పుణ్యమ్మ, ఈనాయత్ మహమ్మద్, మహమ్మద్ జమీల్, ప్యార్లనగేష్, మహమ్మద్ అజీమ్, జగదీష్‌గుప్త, మాధవరెడ్డి, హనుమంత్ రెడ్డి, మహమ్మద్ అజీమ్, మహమ్మద్ ఉస్మాన్, మహమ్మద్ నయీమ్, మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ప్రధాన మంత్రికి మాజీ మంత్రి నివాళులు...**

మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలోని అతిథి గృహం వద్ద జాతీయ రహదారిపై వద్ద గల ఇందిరా గాంధీ విగ్రహానికి మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మక్సూద్ అహ్మద్, శంషీర్, శైకత్ అలీ, శాకీర్ అలీ, జేజే జావిద్, ఖాజా బాయ్, నయీమ్, మోయిజ్, గౌసోద్దిన్, ముర్జల్, మాజీద్, జైరాజ్, మోహన్, సత్తార్, పరమేష్, అజయ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన రష్మికరాథోడ్‌కు సన్మానం

**సిర్గాపూర్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ఎంబిబిఎస్ విద్యను అందుకునేందుకు అవకాశం దక్కించుకున్న మండల పరిధిలోని లొంక తండాకు చెందిన సునీతదేవి, గోవింద్ నాయక్ దంపతుల తనయ రష్మిక రాథోడ్‌ను శుక్రవారం గిరిజన, అంబేద్కర్ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి నోటిని తీపి చేశారు. విద్యార్థిని రష్మిక రాథోడ్ ఎంబిబిఎస్‌లో సీటు సాధించడం గిరిజనతండా పేరు మారుమోగుతోందని, రష్మిక రాథోడ్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశాలను దక్కించుకోవాలన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకుంటే ఉన్నత చదువులు చదవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు నారాయణ నాయక్, కాంగ్రెష్ ఎస్టీ సెల్ అధ్యక్షులు తుకారాం పవర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బాబు, తండా మాజీ ఉప సర్పంచ్ రాజు, తండా వాసులు డీలర్ శంకర్ నాయక్, గోపాల్, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బద్రిగూడెంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**చౌటకూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బద్రిగూడెంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సూచనల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రామాగౌడ్, సలహాదారులు శివకుమార్ యూత్ ఉపాధ్యక్షులు చోలేటి మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటి చైర్మన్ లక్ష్మణ్, మండల మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు కైసర్, ఈశ్వర్‌గౌడ్, గోవర్ధన్, వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు వర్కల రమేష్, రాజశేఖర్, మల్లికార్జున్ గౌడ్, శివరాజ్‌గౌడ్, రంగాగౌడ్, ప్రభాకర్, సంజయ్‌కుమార్, వసంత్, సుజనయ్య, మల్లేశం, పండరి, రాజుగౌడ్, వినయ్, రమేష్,చంటి, బైరు మల్లేశం, శివయ్య, మైసయ్య, వెంకటేశం, దశరథ్, డిసిఎంఎస్ నిర్వాహకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక 4 కోడ్‌లను రద్దు చేయాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 31,ప్రభాతవార్త:** ఏఐటీయూసీ 106వ ఆవిర్భావదినోత్సవ సందర్భంగా శుక్రవారం సంగారెడ్డిలో పతాకావిష్కరణలు జరిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎంఏ రెహమాన్, వెంకట్రాజ్యం సంయుక్తంగా మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక 4 కోడ్ లను వెంటనే రద్దు చేయాలి, రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, సలీం,సుంకన్న, శివశంకర్, లక్ష్మి, దుర్గాయా, ప్రవీణ్, పాల్గొన్నారు.

## దేవునికందిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన



దేవుని కందిలో ఆంజనేయస్వామి విగ్రహా ప్రతిష్టాపన దృశ్యం

**కంది, అక్టోబరు 31, ప్రభాతవార్త:** దేవుని కంది గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజ స్థంభాల పున: ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నేత్ర పర్వంగా ఆలయ కమిటి ఆధ్వర్యంలో కొనసాగాయి. గత మూడు రోజులుగా గ్రామంలో వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుంగా ప్రతిష్టాపన కార్యక్రమంలో కనుల పండువగా కొనసాగాయి. ఆలయంలో హోమాలు, పూర్ణాహుతి, బలిదానము, ప్రాణ ప్రతిష్టా, ఆశీర్వచనము, బొడ్రాయి ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు రాఘరాంరెడ్డి, రామకృష్ణరెడ్డి, మోహన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, ఆలయకమిటి బాధ్యులు నర్సింలు, మహేందర్, మల్లేశం, బిక్షపతి, బాలమల్లేష్, రాజు, కృష్ణ, దిలీప్‌రెడ్డి, మల్లేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో జాతీయ ఐక్యత దివస్

**అల్లాదుర్గం, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, యువకులు, గ్రామస్థులతో కలిసి ఏక్తా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ కళాశాల నుంచి బస్టాండ్ వద్ద గాంధీ చౌక్ వరకు ఒకటే మొత్తం ఒకటే జాతి ఒకటే దేశం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

## హరీష్ రావును పరామర్శించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ మరణించిన విషయం విధితమే. శుక్రవారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి కోకాపేటలోని హరీష్ రావు నివాసానికి వెళ్లారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం హరీష్ రావును ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పాండు, షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

# చేతికి వచ్చిన పంట నీటిపాలు

-దెబ్బ మీద దెబ్బ కోలుకోని రైతులు
-అధిక వర్షాలతో అతలాకుతలం



తెంచడానికి సిద్దంగా ఉన్న పత్తి

**మర్పల్లి, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మరణిస్తానని తెలిసినా సైనికుని పోరాటం తప్పదు.. నష్టపోతానని తెలిసినా రైతుకష్టం తప్పదు.. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు నష్టపోయిన రైతులకు మరిన్ని కష్టాలు ఎదురవుతున్నాయి. అతివృష్టి, అనావృష్టితో ప్రతి సంవత్సరం రైతులు నష్టపోతూనే ఉన్నారు. వర్షాకాలం ప్రారంభంలో సరైనవర్షాలు కురువకపోవడంతో, చిరు ధాన్య పంటలైన పెసర, మినుము, మంచినువ్వులు, పూర్తిగా నష్టపోగా, మొక్కజొన్న, పత్తి, సోయాబిన్ పంటలు ఎదగలేదు. రైతులు అధికంగా సాగుచేసిన పత్తిపంట ఎదుగుదల లేక పోవడంతో సగానికిసగం దిగుబడి తగ్గిపోగా పంట పెట్టుబడి సైతం అందని దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అక్టోబరుమాసంలో అధిక వర్షాలు కురవడంతో పంటపొలాల్లో నీరుచేరి పంటలు నీటమునిగి, ఎర్రబారిపోయి పంటలు నష్టపోగా చేతికొచ్చిన కాస్తోకూస్తో మొక్కజొన్న, సోయాబీన్ పత్తి, పంటలను నూర్పిడి చేసుకుందామనుకుంటే మొంథా తుపాను రైతుల పంటలపై మరోసారి దెబ్బకొట్టింది. ఉన్న కాస్త పంటలు చేతికొస్తాయనుకుంటే మొక్కజొన్న, పత్తి వర్షానికితడిసి ముద్దవుతుంటే దిక్కుతోచని రైతన్న లబోదిబోమంటున్నాడు. పెట్టుబడి ఫుల్.. రాబడి నిల్.. గ్రామీణప్రాంతాలలో నూటికి తొంభైశాతం రైతులు వ్యవసాయరంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు ప్రతియేటా రైతును నష్టాలకు గురిచేస్తున్నాయి. వ్యవసాయ పెట్టుబడులు రోజు రోజుకు పెరిగిపోవడం, కూలీలరేటు పెరిగిపోవడంతో పంట దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర రాక పోవడంతో పంట పెట్టుబడులు సైతం చేతికి అందడం లేదని, ప్రతియేటా అప్పులే మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి...**

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భారీవర్షాలకు వాగులు పొంగి, పంటలు కోతకు గురైనాయని, వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలపై ఆధారపడ్డ తాము పంటలు నష్టపోయి అప్పుల ఊబిలో చిక్కుకున్నామని రైతులు వాపోతున్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సీడి ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## పోలీసు ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ



రన్ ఫర్ యూనిటీ సందర్భంగా మాట్లాడుతున్న ఎస్పీ శైలజ

**కోట్‌పల్లి, అక్టోబరు, 31, ప్రభాతవార్త:**

భారతదేశ ఉక్కు మనిషి, అఖండ భారత్ నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా రాష్ట్రీయ ఏక్తా దివస్, (జాతీయ ఐక్యతా దినోత్సవం)గా జరుపుకుంటున్న సందర్భంగా వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పోలీసులు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 7గంటలకు రన్ ఫర్ యూనిటీని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ శైలజ మాట్లాడుతూ, భారతదేశ రాజకీయ ఏకీకరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన అద్భుతమైనకృషిని స్ఫూర్తిగా తీసుకుని, దేశసమైక్యత, సమగ్రత భద్రతకు కట్టుబడి ఉన్నామని ఈకార్యక్రమం ద్వారా మరోసారి చాటిచెప్పడం జరిగిందన్నారు. రన్ ఫర్ యూనిటీలో సుమారు 100మందికి పైగా పౌరులు ఉత్సవంగా పాల్గొనడం జరిగిందన్నారు. ఇది కేవలం పరుగు మాత్రమే కాదని అందరూ జాతీయ ఐక్యతకు స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ తనపట్టుదలతో 560కుపైగా ముక్కలైన సంస్థానాలను ఏకతాటిపైకితెచ్చి దేశాన్ని బలోపేతంచేశారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, కాంగ్రెసన పార్టీ నాయకులు నక్కల బందయ్య, పోలీసు సిబ్బంది, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో రన్ ఫర్ యూనిటీ



కొడంగల్‌లో 2కె రన్‌ను ప్రారంభిస్తున్న సిఐ, ఎస్పై

**కొడంగల్, అక్టోబరు 31, ప్రభాతవార్త:**

ఉక్కుమనిషి, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కొడంగల్ పట్టణంలో రన్ ఫర్ యూనిటీని నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి మిషన్ భగీరథ వరకు జరిగిన 2కె రన్‌ను సిఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్పై జివి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు అక్కడే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ దేశసమైక్యతను పెంపొందించడమే ఈపరుగు ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, పట్టణవాసులు పెద్దయెత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ:**

కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞచేసి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ స్వతంత్రంగా ఉన్న అనేక రాజ్యాలను విలీనంచేసి నేటి విశాలమైన స్వతంత్ర భారతదేశాన్ని నిర్మించిన గొప్ప ఘనత వల్లభాయ్ పటేల్‌కు దక్కుతుందని కొనియాడారు.

## సమస్యలను అధికారులు పరిష్కరించాలి

-మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి



సమస్యలను అధికారులకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 31, ప్రభాతవార్త:**

మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు హెచ్ఎండిఎ, మున్సిపల్ అధికారులు శుక్రవారం ప్రతాపసింగారం గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని ప్రతాపసింగారం గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి హెచ్ఎండిఎ, మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తిమేరకు హెచ్ఎండిఎ, మున్సిపల్ అధికారులు గ్రామంలో పర్యటించారు. గ్రామపరిధిలోని ప్రతాపసింగారం, గౌరెల్లి రోడ్డు దుస్థితిని వివరించారు. వరదనీటితోపాటు మురుగునీరు సక్రమంగా ప్రవహించేందుకు డ్రైనేజీ ఏర్పాటుకు పలుచోట్ల నీటినిల్వను మాజీ ఎమ్మెల్యే అధికారులకు చూపించారు. గ్రామంలో పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు. గ్రామంలో పర్యటించినవారిలో మాజీ ఎమ్మెల్యే వెంబడి హెచ్ఎండిఎ డిఈ సత్యాప్రసాద్, ఏఈ వెంకటేష్, డిఈ మహిపాల్, పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ తదితరులున్నారు.

## కష్టజీవుల జెండా ఎప్పటికీ ఎర్రగానే ఎగురుతుంది

-సిఐటియు కన్వీనర్ బీసా సాయిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియూ నాయకులు

**కొత్తూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త:**

కొత్తూరు మండల కేంద్రంలో శుక్రవారం సిఐటియు మండల కన్వీనింగ్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈసమావేశంలో అంగన్వాడీ, ఆషా, గ్రామ పంచాయతీ, మధ్యాహ్న భోజన పథకం వంటి విభాగాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా బీసా సాయిబాబు మాట్లాడుతూ, శ్రామికుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం సిఐటియు. ఎర్ర జెండా అంటేనే కంపెనీ యజమానులు, పెట్టుబడిదారులకు గుబులు పుడుతుంది. కష్టజీవుల హక్కుల కోసం ఎర్రజెండా ఎప్పటికీ ముందుండి పోరాడుతుంది అని పేర్కొన్నారు. తరువాత మండల కన్వీనింగ్ కమిటీ ప్రతిపాదన పెట్టగా, సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా బీసా సాయిబాబును కొత్తూరు మండల సిఐటియు కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. మొత్తం 16 మంది సభ్యులతో మండలకమిటీని ప్రకటించారు. కమిటీ సభ్యులు అంగన్వాడీ రంగం జయమ్మ, అరుంధ, జ్యోతి, అనిత, సుజాత, ఆషా, రంగం వసంత, జంగిర్, బి.మంజుల, నవనిత, లత, కార్మికవిభాగం లక్ష్మణ్, మధ్యాహ్న భోజనం విభాగం పెంటమ్మ, ఫరిదాబేగం, గ్రామపంచాయతీ విభాగం జంగమ్మ, యాదమ్మ, బాలకృష్ణ, సిఐటియు నాయకులు, మహిళాకార్యకర్తలు, స్థానిక కార్మికసంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో ఐక్యతాపరుగు




రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ప్రారంభించిన డిసిపి కోటిరెడ్డి

**మేడ్చల్, అక్టోబర్ 31, ప్రభాతవార్త :**

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా యువతలో జాతీయసమైక్యత, క్రమశిక్షణను ప్రోత్సహించడానికి ప్రతీకాత్మకంగా మేడ్చల్ పోలీసుల ఆధ్వర్యంలో ఐక్యత పరుగు (రన్ ఫర్ యూనిటీ) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని అయోధ్య చౌరస్తా వద్ద రన్ కార్యక్రమాన్ని ప్రారంభించి గౌడవెల్లి గ్రామ శివారులోగల రాంరెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద ముగించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జోన్ పరిధిలోని యశోద నర్సింగ్ కాలేజ్, సిఎంఆర్ కాలేజ్, మల్లారెడ్డి కాలేజ్ విద్యార్థులతో పాటు మేడ్చల్ స్థానిక యువజన సంస్థల ప్రతినిధులు సుమారు 500 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి ముగింపు తర్వాత విజేతలకు బహుమతులు అందిజేశారు. అనంతరం డిసిపి మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ సమైక్యతకు ప్రతీక అని ఆయన చూపిన దారిలోనడవడం ప్రతిపౌరుడి బాధ్యత అని అన్నారు. ఈరోజు జరుపుకుంటున్న ఐక్యత పరుగు, కేవలం క్రీడా కార్యక్రమం కాదని, ఇది యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, కలిసికట్టుగా ముందుకు సాగే ఆత్మవిశ్వాసంనింపే ఆత్మీయయజ్ఞం అని అన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. ఫిట్‌నెస్ అంటే కేవలం శరీర దృఢత్వం మాత్రమే కాదని, మనసు, ఆలోచనల బలం కూడా అని అన్నారు. పటేల్ దేశ ఐక్యత కోసం ఎలా త్యాగం చేశారో, మనం కూడా సామాజిక ఐక్యత కోసం శ్రమించాలన్నారు. ప్రతి యువకుడు సమాజసేవలో భాగస్వామి కావాలని, ఐక్యత పరుగు వంటి కార్యక్రమాలు ఫిట్‌నెస్‌తో పాటు సామాజిక బాధ్యతను గుర్తుచేస్తాయని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ అడిషనల్ పాల్గొన్న పురుషోత్తం, పాల్గొన్న ఎసిపిలు శంకర్‌రెడ్డి, బాల గంగిరెడ్డి, సిఐ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హరీష్‌రావును పరామర్శిస్తున్న ఆదర్శ్‌రెడ్డి

## హరీష్‌రావును పరామర్శించిన ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మాజీ మంత్రి తన్నీర్ హరీష్‌రావును పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల మృతి చెందటంతో శుక్రవారం ఆదర్శ్‌రెడ్డి హైద్రాబాద్‌లోని హరీష్‌రావు నివాసానికి చేరుకుని సత్యనారాయణరావు చిత్ర పటానికి నివాళులు అర్పించి హరీష్‌రావును పరామర్శించారు.

## ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే జీఎంఆర్



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దృశ్యం

**పటాన్‌చెరు, అక్టోబరు 31, ప్రభాతవార్త :** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ సమీకృత కార్యాలయ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిత్రి హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, జివిఆర్ ఎంటర్ప్రైజెస్ సంస్థల సౌజన్యంతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంలో భాగంగా నీటిపారుదల, గ్రామీణ నీటిపారుదల, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, అంగన్‌వాడీ భాగాలకు చెందిన నియోజకవర్గ స్థాయి కార్యాలయాలు అన్నింటిని ఒకే భవనంలో కార్యకలాపాలు నిర్వహించేలా భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలోని ప్రభుత్వ విభాగాలన్నింటికీ శాశ్వత ప్రాతిపదికన ఆధునిక వసతులతో భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు సంపూర్ణ సహకారం అందించిన ఆదిత్రి యాజమాన్యం నాగేశ్వరరావు, సురేష్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, ఆదిత్రి కన్‌స్ట్రక్షన్స్ ఎండి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బండి శంకర్, పరమేష్ యాదవ్, అధికారులు భీం, సురేష్, శ్రీనివాస్, యాదగిరి, రంగారావు, జయరాం నాయక్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి



బొల్లారం మున్సిపాలిటీ ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు దృశ్యం

**జిన్నారం, అక్టోబరు 31, ప్రభాతవార్త :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను బొల్లారంలో ఘనంగా నిర్వహించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్ కాలనీలోఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్ల మహేందర్‌రెడ్డి, స్థానిక బాలాజీ నగర్ వాసుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, రాంప్రసాద్, రఘు, శ్రీహరి, రమేష్, రతలు, సతీష్, సందీప్ రెడ్డి, ప్రభు, సమీర్, చెందనం, కుందనం, రాజు, రమణ, శివ రెడ్డి, భార్గవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## వల్లభభాయ్ పటేల్ జయంతి

**జిన్నారం, అక్టోబరు 31, ప్రభాతవార్త :** భారత ఉక్కుమనిషి, దేశం మొదటి ఉపప్రధాని సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏకతా దివస్‌లో భాగంగా శుక్రవారం ఉదయం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం బొల్లారం పోలీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి నేతృత్వంలో ఖాజిపల్లి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ నుండి 2 కిలోమీటర్ల మేర రన్ నిర్వహించారు. సామాజిక ఐక్యత, జాతీయ ఏకతా ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం

**నారాయణఖేడ్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లోని ఉప ఎన్నికల సందర్భంగా నారాయణఖేడ్ మండలం సంజీవరావు పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుజ్జమ్ రాములు, బండి విట్టల్, మర్పల్లి అశోక్, శివ, రాములు, అమర్, రాంబాబు,రాములు, సురేష్ వినోద్, ప్రభాకర్ తదితరులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో దూసుకెళుతుందని కాంగ్రెస్ పార్టీని గెలిపించి మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని మల్లు రవి అన్నారు.

## నల్లపోచమ్మ ఆలయం వద్ద హైమాస్ లైట్ ఏర్పాటు

**మనూర్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువున్న నల్లపోచమ్మ ఆలయం వద్ద నారాయణఖేడ్ ఎమ్మెల్యే సహకారంతో హైమాస్ లైట్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద రాత్రిళ్ల చీకటి ఉండటంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే హైమాస్ లైట్‌ను మంజూరు చేయించారిన ఆలయ కమిటి అధ్యక్షులు మల్లప్ప, ఆలయ ఇఓ శివరుద్రప్ప, ఆలయ అర్చకులు సిద్దయ్యస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుస్వామికి సన్మానం

**గజ్వేల్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, గజ్వేల్ మండల ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ కోశాధికారి గంగిశెట్టి వెంకటేశంగుప్త శబరిమలై వరకు పాదయాత్ర చేపడుతున్న సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లో నాచారం దేవస్థానం డైరెక్టర్, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, తాజా మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, చింత వెంకటేశంస్వామిల ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగిశెట్టి వెంకటేశం గురుస్వామి గతంలో గజ్వేల్ నుండి శబరిమలై వరకు పాదయాత్ర చేశారని, రెండవసారి హైద్రాబాద్ నుండి శబరిమలై వరకు పాదయాత్ర చేస్తున్న సందర్భంగా సన్మానించడం జరిగిందన్నారు. అయ్యప్ప మాలధారణ శ్రేష్టమని, అయ్యప్ప మాలధారణ వేసుకున్నవారికి సకల పాపాలు తొలగిపోయి అష్టైశ్వర్యాలు చేకూరుతాయన్నారు. దైవనామ స్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని, ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కాశినాథ్, సిరిపురం సత్యనారాయణ, సిద్ది నవీన్, కైలాస ప్రశాంత్, గంగిశెట్టి బాలయ్య, భాస్కర్, ఉమేష్, ఉప్పల చంద్రశేఖర్, సిద్దేశ్వర్, విక్రాంత్, బుద్ద ,శంకరయ్య, గందె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎఐటియుసి నాయకులు

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

### ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఏఐటీయూసి పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐటియూసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ అన్నారు. ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువ రెడ్డి భవన్‌లో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1920 అక్టోబర్ 31న దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, కార్మిక వర్గానికి 8 గంటల పని దినం, పని భద్రత అమలు కావాలని కార్మికులకు హక్కులు, చట్టాలు ఉండాలని ముంబాయి కేంద్రంగా ఏఐటియూసి ఆవిర్భావించిందన్నారు. అనాటి నుంచి దేశంలో ఉన్న కార్మికులను ఐక్యం చేసి పోరాటాల ఫలితంగానే చట్టాలు, హక్కులు సాధించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐటియూసి నాయకులు పిట్ల మల్లేశం, కరుణాల చంద్రం, బెక్కంటి సంపత్, బిక్షపతి, ఐలయ్య, రాజు, శ్రీనివాస్, కనకయ్య, రవి, పరశురాములు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో సమత ర్యాలీ



సమత ర్యాలీలో పాల్గొన్న యువకులు

**కొమురవెల్లి, అక్టోబరు 31, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150 జయంతి రాష్ట్రీయ ఏక్తాదివస్ సందర్భంగా ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో సమత ర్యాలీ నిర్వహించారు. పోలీసు బొమ్మ నుంచి గోశాల వరకు సమత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గ్రామ యువకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం

### ఎఐటియుసి నేత అందె అశోక్



జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**చేర్యాల, అక్టోబరు 31, ప్రభాతవార్త :** కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్న గొప్ప కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని ఆసంఘం రాష్ట్ర నాయకులు అందె అశోక్ అన్నారు. శుక్రవారం కార్మిక సంఘం 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గాంధీసెంటర్‌వద్ద కార్మిక సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్ రెడ్డి, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, పోనుగోటి శ్రీనివాస్‌రెడ్డి, చింతల నరేష్, నంగి సత్తయ్య, మల్లిగారి నరసింహులు, సకినాల సాయినాథ్, ఎండి.గోరెమియా పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం



సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**వర్గల్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గౌరారం పోలీసుల సహకారంతో విద్యాలయంలో 11వ తరగతి విద్యార్థులు విద్యాలయ ప్రాంగణం నుండి వర్గల్ క్రాస్ రోడ్ వరకు ఐక్యత పరుగును నిర్వహించారు. అనంతరం వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర అధ్యాపకుడు సిఎంవి శేషు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ దేశ ఐక్యతకై పాటుపడ్డ సందర్భాలను వివరించారు. అలాగే ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు.

## నీట మునిగిన పంటలకు నష్టపరిహారం అందించాలి

### -డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో కురిసిన వర్షానికి దెబ్బతిన్న వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టపరిహారం ఎకరానికి రూ.10వేల నుంచి రూ.50వేల వరకు పెంచి తక్షణమే అందివ్వాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి, రంగంపేట, ధర్మారెడ్డిపల్లి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంథా తుఫాన్ వల్ల చేతికొచ్చిన పంట నేల రాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంతో పాటు రైతు భరోసాను త్వరగా అందజేసి అండగా నిలవాలన్నారు.



వర్షానికి దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఏగొండస్వామి, కుమార్

# మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళులు



చేర్యాలలో ఇందిరా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ప్రజ్ఞాపూర్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట అభ్యర్థి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ 41 వర్ధంతి వేడుకలను అత్తు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భగంగా అమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాదడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, మార్క సతీష్‌గౌడ్, రాజబహూదూర్‌రెడ్డి, గ్యాదరి మధు, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**చేర్యాలలో...**

**చేర్యాల, అక్టోబరు 31, ప్రభాతవార్త :** ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు దాసరి శ్రీకాంత్, మంజె మల్లేశం, జక్కుల తిరుపతి, నాయకులు ఆడేపు చంద్రయ్య, పాల లక్ష్మీనారాయణ, తడక లింగం, అల్లం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్, రాగుల శ్రీనివాస్‌రెడ్డి, రంగు శంకర్, బందిగ రాకేష్ క్రిష్ణ, గూడ రాజిరెడ్డి, పోతుగంటి ప్రసాద్, నీలం సన్నీ, తాటికొండ సదానందం, చింతల మల్లేశం, పచ్చిమడ్ల వెంకటయ్య, రఘువీర్, గదరాజు సురేందర్, శేవెల్ల రాజయ్య, మల్లిగారి నర్సింలు, ఇప్పకాయల రామచంద్రం, ఎండీ నాజర్, సొంటే విక్రమ్, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొనగారి రాజు ఆధ్వర్యంలో గజ్వేల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయ కులు మతీన్, గుంటుకు శ్రీనివాస్, కప్పు భాస్కర్, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, ఏఎంసి డైరెక్టర్ యాదగిరి, నాయకులు సుఖేందర్ రెడ్డి, జంగం రమేష్, జహంగీర్, ప్రేమ్‌కుమార్, లక్ష్మణ్, సాజిద్, శివులు, నాగరాజు, ఎక్బాల్, దయ్యాల యాదగిరి, అజార్, జహీర్, ఖాజా, అసన్‌పాషా, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...**

గజ్వేల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ వర్ధంతిని శుక్రవారం తీగుల్ గ్రామ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆత్మ కమిటీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి, జయల వేణుగోపాల్, నవీన్‌గౌడ్, బునారి వెంకటేష్, రియాజ్, అజయ్, నవీన్‌చారి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

## ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించాలి

### మెదక్ ఆర్డీవో రమాదేవి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. శుక్రవారం అంబాజీపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు కేంద్రం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాకే నివేదిక అందించాలని ఆర్ఐ రాజుకు సూచించారు. తహసీల్దార్ మాలతి, ఆర్ఐ రాజులు ఉన్నారు.

## హక్కులపై అవగాహన అవసరం : తహసీల్దార్



కొండాపూర్‌లో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మాలతి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:** కుల, మత బేధాలు తగవని ప్రజలందరూ సమానమే అని తహసీల్దార్ మాలతి అన్నారు. శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధి కొండాపూర్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాలతి మాట్లాడుతూ ప్రజలంతా సామరస్యంగా కలిసిమెలసి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ రాజు, ఏఎస్ఐ విఠల్ తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రామాయంపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :** రామాయంపేట సహకార సంఘం తరుపున గోల్పర్తి పెద్దమ్మ గుడి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాత రావు ప్రారంభించారు. పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, సరాఫ్ యాదగిరి, శారదా రాజు తో కలసి ప్రారంభించినారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యం విక్రయించాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో దేమ యాదగిరి, చిలుక గంగాధర్, అల్లాడి వెంకటి, చింతల స్వామి, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం




చిన్నశంకరంపేటలో టు కే రన్ నిర్వహిస్తున్న పోలీసులు

## పోలీసుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ

**చిన్నశంకరంపేట, అక్టోబరు 30, ప్రభాతవార్త:** పట్టణంలో శుక్రవారం ఎస్ఐ నారాయణగౌడ్ ఆధ్వర్యంలో టూ కే రన్‌ను నిర్వహించారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడు, సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్-2025 కార్యక్రమంలో భాగంగా ఈ టూకే రన్‌ను నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు పట్టణ శివారులోని శ్రీనివాస కళ్యాణ మండపం నుండి పోలీస్ స్టేషన్ వరకు టూ కే రన్‌ను నిర్వహించగా యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం వారితో మాదక ద్రవ్యాల నిర్మూళన, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ఎస్ఐ నారాయణగౌడ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజు, రాజశేఖర్, శ్రీధర్, విఠల్, శ్యామ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 30,ప్రభాతవార్త:** దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని దర్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అన్నారు. శుక్రవారం దర్పల్లిలో పదవ తరగతి చదువుతున్న 38 మంది విద్యార్థుల వార్షిక పరీక్ష ఫీజును విద్యుత్తు శాఖ అసిస్టెంటు ఇంజనీరు స్వప్న సహకారంతో రూ.4750 రుపాయల చెక్కును ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావుకు అందించారు. వార్షిక ఫీజును చెల్లించిన స్వప్న, హార్ట్ టూ హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ సభ్యులకు విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సురేష్, శ్రీనివాస్, జ్యోతి, సరోజిని, జయ, ఉమాదేవిలు పాల్గొన్నారు.

## వరమాత్మని సేవలో మోక్షం...

**పాపన్నపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :** వరమాత్ముని సేవలో మోక్షం ఉంటుందని మాధవానంద సరస్వతి స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన నాగ్సాన్‌పల్లి వరిధిలోని కేదారీశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నిత్యం భగవంతుని పూజ చేయాలని భక్తులను కోరారు. ధర్మాన్ని రక్షిస్తే, అది మనలను రక్షిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో శ్యాం సుందర్ శర్మ, రాజశేఖరశర్మ, రామశర్మ, సత్యం, ఎర్రం రవీందర్, ఇంద్రసేనా రెడ్డి, యాబన్న, భూషణం, భూమయ్య, సాయిబాబ, భక్తులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావుకు పరామర్శ

**పాపన్నపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :**

మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా మాజీ మంత్రి హరీష్ రావును వరామర్శించారు. ఇటీవల హరీష్రవు తండ్రి చనిపోయిన నేపథ్యంలో శశిధర్ రెడ్డి, ఆయన సతీమణి సునీత రెడ్డి, వారి కుమారులు విశ్వరథ్ రెడ్డి, వశిష్ట రెడ్డి ఆయనను వరామర్శించారు.



హరీష్‌రావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కుటుంబీకులు

# ఫీజు రీయింబర్సుమెంట్‌ను విడుదల చేయాలి

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 31, ప్రభాతవార్త :**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంటును వెంటనే విడుదల చేయాలని ఎబివిపి జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎబివిపి రాష్ట్ర కమిటీ పిలువు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నూతన బస్టాండు సమీపంలో శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డికి పిండ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8500 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖను చూస్తున్న సిఎం రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఫీజు రీయంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని చెపాపరు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడంతో పాటు ప్రభుత్వ వైఫల్యం వలన సంక్షేమ హాస్టళ్లలో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేసి విద్యా వ్యవస్థను పూర్తిగా పటిష్టం చేయాలన్నారు. విద్య వ్యవస్థను పటిష్టం చేయడంలో, బకాయిలు చెల్లించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన రాష్ట్రంలో మంత్రుల పర్యటనలు ఎక్కడికక్కడే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ పవన్, రాష్ట్ర వనవాసి కో-కన్వీనర్ పరశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణిందర్, నగర కార్యదర్శి చరణ్, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




సిఎం రేవంత్‌రెడ్డికి పిండ ప్రధానం చేస్తున్న దృశ్యం



గజ్వేల్‌లో 2కె రన్‌లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది, యువకులు

## ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి : సిఐ

**గజ్వేల్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని సిఐ రవికుమార్ అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా నిర్వహించిన 2కె రన్‌లో సిఐ రవికుమార్, ట్రాఫిక్ సిఐ మురళి, ఐ కమ్యూనికేషన్ సిఐ సైదా, విద్యుత్‌శాఖ ఏఈ సత్యంతోపాటు పోలీస్ సిబ్బంది, రన్నర్స్, వాకర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు రన్నింగ్, వాకింగ్, యోగా, సైక్లింగ్, స్విమ్మింగ్ ఏదో ఒకటి చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని అన్నారు. ఆరోగ్యంగా ఉంటే మనిషి ఏదైనా సాధించవచ్చని తెలిపారు. మనం తీసుకునే ఆహారంలో కూడా సమతుల్యత ఉండాలని అప్పుడే ఆరోగ్యం బాగుంటుందన్నారు.

**మర్కుక్‌లో...**

**మర్కుక్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రన్ ఫర్ యూనిటీ 2కె రన్ కార్యక్రమాన్ని ఎస్ఐ దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించగా యువకులు, డైలీ వాకర్స్ అండ్ రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ మనిషి జీవితంలో ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. 2కె రన్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.వెయ్యి, తృతీయ బహుమతి రూ.500 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**జగదేవ్‌పూర్‌లో...**

**జగదేవ్‌పూర్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** భారతదేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి, ఏక్తా దివస్ సందర్భంగా శుక్రవారం ఎస్ఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గొల్లపల్లి ఎక్స్ రోడ్డు వద్ద 2కె రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 2కె రన్‌లో యువకులు, పెద్దలు అందరూ కలిసి పాల్గొని ఏకత్వం, సోదరభావాన్ని పెంపొందించారన్నారు. ఈ రన్‌లో మొదటగా వచ్చిన ముగ్గురు వ్యక్తులను ఎస్ఐ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ద నాగరాజు, పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, యువకులు, పెద్దలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కొమురవెల్లి, అక్టోబరు 31, ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతా పేదలకు ఎంతో మేలు చేస్తాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గొల్లపల్లి పద్మ అంజనేయులు అన్నారు. మంగల కేంద్రంలో శుక్రవారం మేడ్చల్ మెడిసిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మందికి పైగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మ అంజనేయులు మాట్లాడుతూ భవిష్యత్‌లో పేదల కోసం మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ముత్యం నర్సింలు, ఎక్కలదేవి రాజు, కడెం కరుణాకర్, గజ్జె వెంకటేష్, దువ్వల శ్రీనివాస్, బైరి హరీష్, లింగంపల్లి అజయ్, మ్యాకల రాకేష్, వినయ్‌యాదవ్, మనోజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును పరామర్శించిన బిఆర్ఎస్ నేతలు



హరీష్‌రావు తండ్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**మర్కుక్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మర్కుక్ మాజీ సర్పంచ్ భాస్కర్, నాయకులు సంతోష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, మహేష్, రాజు తదితరులు శుక్రవారం హరీష్‌రావును పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు తండ్రి చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు.

## జూబ్లీహిల్స్‌లో నవీన్‌యాదవ్ గెలుపు తథ్యం

### -ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం ఖాయమని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, పత్తి కొనుగోలు పర్యవేక్షణ కమిటీ సభ్యులు చిట్కుల శివా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని రహమత్‌నగర్, అంజయ్య కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు గజ్వేల్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తామని హామీ ఇస్తున్నట్లు తెలిపారు. నవీన్‌యాదవ్ జూబ్లీహిల్స్ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ ప్రతినిత్యం ప్రజల వెంటే ఉంటారన్నారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మన్నె అరుణ్‌కుమార్, దప్పు గణేష్, శివకుమార్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## కెజిబివిని తనిఖీచేసిన ఎంపిడివో

**మర్కుక్, అక్టోబరు 31 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలను శుక్రవారం ఎంపిడివో విక్రమ్ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని తరగతి గదులు, రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే విద్యాలయ పరిసరాలను, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. పాఠశాల, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి అకాడమిక్స్ జనరల్ నాలెడ్జ్ అవగాహన పెంచుకో వాలని తెలిపారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం బాగుందన్నారు. కార్యక్రమంలో కెజిబివి స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయినిలు ఉన్నారు.

## విద్యార్థులకు ఐడి కార్డు, టై బెల్టుల అందజేత

**రామాయంపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు సాయి చందర్ 90 మంది విద్యార్థులకు ఉచితంగా ఐడికార్డ్, టై, బెల్టులను తన సొంత నిధులతో ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి, సమీప పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్, సి ఆర్ పి రవీందర్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## కంగ్టిలో ఉచిత వైద్య శిబిరం

**కంగ్టి, అక్టోబరు 31 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నూతనంగా రాధా క్లినిక్‌ను శుక్రవారం నాడు స్థానిక మాజీ సర్పంచ్ నాగనాథ్ ఆధ్వర్యంలో ప్రారంభించినారు. మారు మూల ప్రాంతంలో బిహెచ్ఎంఎస్ వైద్యులు రావడం చాలా సంతోషం అని డాక్టర్ నెహ్రు ను అభినందనలు తెలిపారు, పుట్టిన ఊరు పెరిగిన ప్రాంతం చదువుకున్న ఊర్లో సేవలు చేయడం చాలా సంతోషం అని తెలియజేసారు. నేటి కాలం లో ప్రతి మనిషికీ ఆరోగ్యం చాలా ముఖ్యం మని ప్రతి ఒక్కరు వ్యయామం చేయాలనీ ప్రజలకు సూచించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో ఉచితంగా మందులు, ఈసీజీ, ఉచితంగా కన్సల్టేషన్, ఉచితంగా షుగర్ టెస్టులు చేశారు.



రన్ ఫర్ యూనిటిలో పాల్గొన్న పోలీసులు.

## ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

**చిలిపిచెడ్, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న యువత దేశ, సమైక్యత,సమగ్రతల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎస్ఐ నర్సింలు అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం మండల కేంద్రంలో రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నర్సింలు మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఐక్యత దినోత్సవంగా నిర్వహించుకుంటామన్నారు. అనంతరం రన్ ఫర్ యూనిటీ ప్రారంభించారు. దీనిలో యువకులు పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం దేశం కోసం మనం నిర్వర్తించాల్సిన బాధ్యతను తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

**నారాయనఖేడ్‌లో...**

**నారాయణఖేడ్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** జడ్పీహెచ్ఎస్ నిజాంపేట పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి విద్యార్థులకు వారి ఆశయ సాధన కృషిచేయాలని శ్రీనివాసరావు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, దేవిసింగ్ గురూజీ, హరి, మారుతి, విటల్‌నాయక్, భారతి, సురేఖ, సుశీల, భ్రమరాంబ, శివాజీ, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ కుమార్, సత్యనారాయణ, రాజు వెంకటరామిరెడ్డి, నర్సింలు, అగ్రికల్చర్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**సిర్గాపూర్‌లో...**



సిర్గాపూర్‌లో రన్ ఫర్ సొసైటీ ర్యాలీ దృశ్యం

**సిర్గాపూర్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సర్దార వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా సిర్గాపూర్‌లో శుక్రవారం ఎస్ఐ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని రన్ ఫర్ సొసైటీ ర్యాలీని నిర్వహించారు. గ్రామంలోని పోలీసు ఠాణా నుంచి కడ్పల్ రోడ్డులోని సబ్‌స్టేషన్ వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎనర్జీ డ్రింక్స్ పంపిణీచేశారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు, ప్రజా ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**భారత దేశ ఐక్యతకు పటేల్ కృషి అమోఘం-ఎంఈఓ**

భారత దేశాన్ని ఐక్యంగా ఏర్పాటు చేసేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అమోఘమని ఎంఇవో నాగారం శ్రీనివాస్ అన్నారు. సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ననత పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులకు జాతీయ ఐక్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్‌లో విజయవంతంగా రన్ ఫర్ యూనిటీ



న్యాల్‌కల్‌లో రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న పోలీసులు, ప్రజలు

**న్యాల్‌కల్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం న్యాల్‌కల్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా రన్ ఫర్ యూనిటీ ర్యాలీని హద్నూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని బస్టాండ్ నుంచి పోలీసులు విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి జై జవాన్ జై కిసాన్ నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ జక్కుల హనుమంతు, ఎస్ఐ దోమ సుజిత్, ఎఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి మరుతి రాథోడ్, న్యాల్‌కల్, హద్నూర్ సొసైటీ చైర్మన్లు మడపతి సిద్దలింగయ్యస్వామి, ఎక్కెల్లి జగన్నాథ్‌రెడ్డి, ఆర్ఐ శ్యామ్‌రావు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**కంగ్టిలో...**



రన్ ఫర్ యూనిటిలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు.

**కంగ్టి, అక్టోబరు 31 ప్రభాతవార్త :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ కంగ్టి ఎస్ఐ దుర్గ రెడ్డి శుక్రవారం నాడు రన్ ఫర్ యూనిటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కంగ్టి మండలం పోలీస్ స్టేషన్ నుండి ఉదయం 08.50 గంటలకు సుభాష్ చంద్ర భోస్ కూడలి వరకు పాఠశాల విద్యార్థు ల తో ఎస్ఐ దుర్గ రెడ్డి పోలీసు వారి సమక్షంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. ఐకమత్యానికి ప్రతికగా నిర్వహించబడే ఈ కార్యక్రమంలో విద్యార్థులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పౌరహక్కులపై అవగాహన

**చిలిపిచెడ్, అక్టోబరు 31 ప్రభాతవార్త :** ప్రజలకు పౌరహక్కులు, వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని సీలంపల్లి గ్రామంలో నిర్వహించారు. శుక్రవారం తహశీల్దార్ సహదేవు ఆధ్వర్యంలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరహక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, పౌరులు తమ హక్కులను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై జైపాల్ రెడ్డి, గ్రామ కార్యదర్శి అఖిల్, ప్రజలు, యువత పాల్గొని నిర్వాహకులకు పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో పౌరహక్కులకు సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడంపై ధన్యవాదాలు తెలిపారు.


పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్



2 కే రన్ ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

## పావన్నపేటలో 2 కే రన్...

**పాపన్నపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :** సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పాపన్నపేటలో పోలీసుల అధ్వర్యంలో 2 కే రన్ నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తో పాటు యువకులు, సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు రన్లో పాల్గొన్నారు. అనంతరం పావన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్...

**పెద్దశంకరంపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :** భారతావనిని ఏకతాటిపై నడిపించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం ఆదర్శప్రాయమని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెద్ద శంకరంపేటలో ఘనంగా జరుపుకున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రేణుకరెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది, యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందరికీ అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పెద్ద శంకరంపేట, అల్లాదుర్గం టేక్మాల్, రేగోడ్ ఎస్సైలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్ రాజేష్ ,పోచయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

**గుమ్మడిదలలో...**



రన్ ఫర్ యూనిట్ లో పాల్గొన్న ఎస్‌హెచ్‌వో లక్ష్మీకాంతరెడ్డి తదితరులు

**గుమ్మడిదల అక్టోబరు 31 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఆఫీసర్ లక్ష్మీ ్మకాంతరెడ్డి, సిబ్బంది ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా "రాష్ట్రీయ ఏక్తా దివస్"లో భాగంగా శుక్రవారం అంబేద్కర్ సర్కిల్ నుండి బొంతపల్లి కమాన్ వద్దకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ లక్ష్మీ ్మకాంతరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశ మొదటి ఉప ప్రధాని మొదటి హోంమంత్రిగా పని చేసిన గొప్ప వ్యక్తి,స్వాతంత్రం అనంతరం ముక్కలుగా ఉన్న 500 కు పైగా సంస్థలను భారతదేశంలో కలపడానికి ఎంతో కృషి చేశారునీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి,మద్ది ప్రతాపరెడ్డి,పుట్ట నర్సింగ్ రావు, కుమార్ గౌడ్, గోవర్ధన్ గౌడ్,కావలి ఐలేష్, తుడుం శ్రీనివాస్, స రెడ్డి గారి బిక్షపతి రెడ్డి, కావలి శంకర్ యాదవ్, మంగయ్య, షేక్ హుస్సేన్, సరెడ్డిగారి వెంకట్రాంరెడ్డి పోలీస్ సిబ్బంది యువకులు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు..

**హత్నూర మండలంలో...**


రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీలో పాల్గొన్న ఎస్సై యువకులు

**హత్నూర అక్టోబరు 31, ప్రభాతవార్త :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం హత్నూర పోలీసుల ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీని హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లీ చౌరస్తా, నుండి దేవులపల్లి గేట్ శివాజీ విగ్రహం వరకు నిర్వహించారు. హత్నూర ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పోలీసు సిబ్బందితోపాటు మండలంలో వివిధ గ్రామాలకు చెందిన యువత,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**రత్నపూరి కళాశాల ఆధ్వర్యంలో...**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రత్నపురి సంస్థలు కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కళాశాల నుండి మల్కాపూర్ చౌరస్తావరకు రాష్ట్రీయ ఏక్త దివస్ ర్యాలీ నిర్వహించారు.

**జహీరాబాద్ పట్టణంలో...**


ఎక్తా దివస్ ర్యాలీని ప్రారంభిస్తునన డిఎస్‌పి సైదా నాయక్,సిఐ శివలింగం

**జహీరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురష్కరించుకుని శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ ర్యాలీని డిఎస్‌పి సైదా నాయక్, పట్టణ సిఐ శివలింగంలు జండా ఊపి ప్రారంభించారు. పోలీసు ఠాణా నుంచి జాతీయ రహదారి గుండా ఎంఆర్‌హెచ్ఎస్ పాఠశాల వరకు కొనసాగింది. ర్యాలీలో పట్టణ ఎస్ఐ కే వినయ్‌కుమార్, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక యువజన సంఘాల సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో...**

జహీరాబాద్ రూరల్ పోలీసుఠాణా ఎస్ఐ కాశీనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు, ఉపాధ్యాయులు విద్యార్థులు, నాయకులతో కలిసి పట్టణ శివారులోని హుగ్గెల్లి బసవేశ్వర చౌక్ నుంచి రంజోల్‌వరకు రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీ నిర్వహించారు.

**నాగల్‌గిద్దలో...**

**నాగల్‌గిద్ద, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురష్కరించుకుని శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురష్కరించుకుని నాగల్‌గిద్ద ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ 2కె రన్ నిర్వహించారు. 2కె రన్‌లో నాగల్‌గిద్ద పోలీసులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు,నాయకులు, యువకులు పాల్గొన్నారు.



నాగల్‌గిద్దలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ దృశ్యం


విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**పాపన్నపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :** జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు, ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు, ముందుగా ఎస్సై శ్రీనివాస్‌గౌడ్,సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, పోటీలలో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు బహుమతులను ఎస్సై అంద చేశారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు అంజాగౌడ్, ప్రవీణ్, నింగప్ప, కృష్ణ కాంత్, రియాజ్, మోహన్ రావు నాగరాజు, అనిల్, విశ్వనాధ్ సుభాష్ తో పాటు పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయి : ఎంఇవో


పదవి విరమణ పొందిన రుద్రమణి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ

**పెద్దశంకరంపేట, అక్టోబరు 31, ప్రభాతవార్త :** ఉద్యోగ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని పెద్ద శంకరంపేట మండల విద్యాధికారి వెంకటేశం అన్నారు. శుక్రవారం మక్త లక్ష్మాపూర్ లో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న రుద్రమణి పదవీవిరమణ అభినందన సభలో పాల్గొని మాట్లాడారు.. ఉపాధ్యాయ వృత్తి లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.. పదవి విరమణ పొందిన రుద్రమనికి ఎంఈఓ తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీకి ఘన నివాళులు...


ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**మెదక్ టౌన్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ప్రధాని ఇందిరాగాంధీ భారత దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కాంగ్రెస్ అధ్యక్షులు పట్టణ గూడూరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా ఇందిరమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గూడూరి కృష్ణ, నాయకులు మంగ మోహన్ గౌడ్, బొజ్జ పవన్,శంకర్ గౌడ్, హరిత నర్సింగ్ రావ్, బుద్ద రాజు గోదల జ్యోతి, కృష్ణ, గాడి రమేష్, స్వరూప, సుఫీ పాల్గొన్నారు.

**బొంతపల్లిలో...**

**గుమ్మడిదల అక్టోబరు 31 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బొంతపల్లి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట నర్సింగ్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, కావాలి శంకర్ యాదవ్, లక్ష్మీ ్మనారాయణ, జంగారెడ్డి, పడమటి మహిపాల్ రెడ్డి,ఆకుల ఆంజనేయులు, బిక్షపతి రెడ్డి,పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు హాజరై ఇందిరా గాంధీకి ఘన నివాళులర్పించారు.

## మహిళా సంఘాలు ఆర్థిక సమృద్ధిని సాధించాలి

**ఝరాసంగం, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మహిళా సంఘాల మహిళలు ఆర్థికంగా సమృద్ధి సాధిస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా డిఆర్‌డిఓ జ్యోతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమాఖ్య సమావేశానికి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటి చైర్మన్‌గా మహిళలకు అకాశం కల్పించిందని, వడ్డీ లేని రుణాలను అందిస్తోందన్నారు. రానున్న రోజుల్లో మండల సమాఖ్యలకు ఆర్టీసి బస్సులను కొనుగోలు చేసి ఇవ్వనున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపిఎం భాగయ్య, సీసీలు మిట్టప్ప, అమృత, తుక్కమ్మ, ఎస్తేర్ రాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు మత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పామాయిల్ సాగుతో ఆర్థిక లాభాలు

**జహీరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ఆయిల్‌పాం పంటల సాగుతో రైతులు ఆర్థికంగా ప్రయోజనాలు అందుకోవచ్చని జిల్లా ఉద్యాన అధికారి పండరి అన్నారు. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని గొడిగార్‌పల్లిలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఫామాయిల్ పంటపైరైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పండరి మాట్లాడుతూ 3750 ఎకరాల్లో ఫామ్ ఆయిల్ పంటను వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ప్రతి ఎకరా ఫామ్ ఆయిల్ పంట సాగుకు నాలుగు సంవత్సరాల పాటు 51వేల రూపాయల సబ్సీడని పంట సాగుచేసే రైతులు అందుకుంటారన్నారు. ఫామ్ ఆయిల్ పంట సాగుతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధులు, డ్రిప్ కంపెనీ ఉద్యోగులు విఠల్, అశోక్, ఈశ్వర్‌రెడ్డి, మహేందర్, నవదీప్, సుందర్, రమేష్, కృపాకర్, గుండయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో పాదయాత్ర

**మెదక్ టౌన్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం మెదక్‌లో బిజెపి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర పట్టణంలోని ఆటోనగర్ వెల్కమ్ బోర్డు నుండి రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది. చౌరస్తాలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బిజెపి నాయకులు


కల్లు దుకాణం వినతిపత్రం అందచేస్తున్న కంది గ్రామస్థులు

## కందిలో కల్లు దుకాణం ఎత్తేయండి

### -ఎక్సైజ్ సూపరిండిడెంట్‌కు కంది వాసుల వినతి

**కంది, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శిశు మందిర విద్యాలయం పక్కన ఏర్పాటుచేసిన కల్లు దుకాణాన్ని ఎత్తేయాలని గ్రామస్థులు శుక్రవారం జిల్లా మధ్య నిషేధ, మధ్యపాన అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ నవీన్‌చంద్రకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కల్లు దుకాణం రాత్రి 12వరకు నిర్వహిస్తుండటంతో ఆ ప్రాంతంలో మధ్యం తాగిన వారితో అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలోని ఇళ్ల ముందు కల్లు తాగిన పాకెట్లు పారేయడంతో పాటు మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే కల్లు దుకాణాన్ని అక్కడి నుంచి ఎత్తేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వినతి చేశారు.

## రోడ్డు పక్కన బావిని పూడ్చేయండి


బావిని పూడ్చేయాలని తహసీల్దార్‌కు వినతిచేస్తున్న మైకోడ్ గ్రామస్థులు

**మనూర్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిని పూడ్చేయాలని తహసీల్దార్ విష్ణుసాగర్‌కు పలు గ్రామాల ప్రజలు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మనూర్ నుంచి మైకోడ్, రాణాపూర్, తుమ్నూర్, దుదగొండ, బోరంచ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు పక్కన మనూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో ఇటీవల మైకోడ్ గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదావశాస్తు పడి మృతి చెందాడని గుర్తు చేశారు. ప్రమాదకరంగా మారిన వ్యవసాయ బావిని పూడ్చేయాలని ఆయా గ్రామస్థులు వినతి చేశారు. కార్యక్రమంలో ఆఱవి శంకర్‌రెడ్డి, దుదగొండ మాజీ సర్పంచ్ రాజు, గ్రామస్థులు బాబన్న, శివాజీరావు, వేరి సంగన్న, గాండ్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓను సన్మానించిన సొసైటీ చైర్మన్


ఎంపిడిఓ షాగుప్త ఇఫత్‌ను సన్మానిస్తున్న సిద్దలింగయ్యస్వామి

**న్యాల్‌కల్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా షా గుప్త ఇఫత్, సూపరింటెండెంట్‌గా వెంకటేశంలు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అధికారులను కార్యాలయ అధికారులు, సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. ఎంపిడిఓ, సూపరిండిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన షా గుప్త ఇఫత్, వెంకటేశంలను న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ మడపతి సిద్దలింగయ్యస్వామి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు మడపతి భద్రుస్వామి, బొల్లి శ్రీనివాస్, జక్కుల సురేష్, ఉపాధి హామీ ఏపిఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఓ శ్వేతకు వ్యవసాయ శాఖ ఆర్థిక సహాయం

**సిర్గాపూర్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురై హైద్రాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న ఏఈఓ శ్వేతకు వ్యవసాయ శాఖ మేమున్నాం 4ంటూ అండగా నిలిచింది. పేద కుటుంబానికి చెందిన శ్వేత కిడ్నీలు పాడవడంతో ఆసుపత్రిలో చికిత్స అందుకునేందుకు ఆర్థిక స్థోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదరు చూస్తున్న తరుణంలో వ్యవసాయ శాఖ అధికారులు తోడుగా నిలిచారు. జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓ ఉద్యోగులు ఏఈఓ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశం ఆధ్వర్యంలో శ్వేత వైద్య ఖర్చులకు గాను 3లక్షల 10వేల 5వందల రూపాయలను శ్వేత తల్లి ఉమారాణికి అందచేసి శ్వేతను పరామర్శించిన మేమున్నాం అధైర్యపడొద్దంటూ దైర్యం నూరిపోశారు.

## గిరిజన తండాలో మొక్కలు నాటిన విద్యార్థులు...

**చిలిపిచేడ్, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిట్కుల్ గిరిజన తండాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వచ్ఛత పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెద్ద త్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి మొక్కలను దత్తత తీసుకొని పెంచేలా ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు అశ్విని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి , సంతోష్ తో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, అక్టోబరు 31, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యులు బూరుగడ్డ పుష్ప నగేష్ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజి సమస్యను పరిష్కరించే దశలో రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో సిసి రోడ్డు నిర్మాణానికి జోనల్ కమీషనర్‌కు నిధుల మంజూరుకు వినతి చేయగా నిధులు మంజూరు చేశారన్నారు. మంజైరైన నిధులతో కాలనీలో సిసి రోడ్డు వేసే ప్రాంతాలను అధికారులు, కాలనీ వాసులతో కలిసి పరిశీలించామన్నారు. కాకతీయ నగర్ సొసైటీ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న థీమ్ పార్క్ పనులను పరిశీలించామని, పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డిఈ కృష్ణవేణి, ప్రభాకర్‌రెడ్డి, నరేంద్రబాబు రాములు, రమేష్, ఉమాశంకర్‌రెడ్డి, వెంకట్‌రావు, రవితేజ, అంజద్, అమలేశ్వరరావు, కృష్ణరెడ్డ, ఆన్ఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్